నిత్యం యోగా సాధన చేయాలి

యోగా శిక్షకుడు పరమార్థదేవ్

ఆసనాలు వేయిస్తున్న యోగా శిక్షకుడు పరమార్థదేవ్

కామారెడ్డి, ఫిబ్రవరి 2: జిల్లా కేంద్రంలోని ప్రొబెల్స్ ఉన్నత పాఠశాలలో భారత స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాందేవ్ బాబా శిష్యుడు పరమార్థదేవ్ సారథ్యంలో మూడు రోజుల పాటు యోగా శిక్షణ శిబిరం కొనసాగనున్నది. శిబిరంలో భాగంగా రెండో రోజు ఆదివారం పరమార్థదేవ్ పలువురితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ ఒక పూట మాత్రమే భోజనం చేయాలని, లేదంటే బరువు పెరిగి రోగాల బారిన పడుతామని తెలిపారు. అధిక బరువే అన్ని రోగాలకు కారణమన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడంతో రోగాలు దరి చేరవని తెలిపారు. సోమవారం కూడా ఉదయం ఐదున్నర నుంచి ఏడున్నర గంటల వరకు యోగా శిబిరం కొనసాగుతుందని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులు శ్రీధర్‌రావు, తెలంగాణ రాజ్య ప్రభారి శివకుమార్, జిల్లా భారత్ అభిమాని అధ్యక్షుడు రాంరెడ్డి, గరపల్లి అంజయ్య, బాస రఘుకుమార్, అంజయ్య, అనిల్‌రెడ్డి, అంకిరెడ్డి, రమేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు' సభను విజయవంతం చేయాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుల విన్నపం ● 7న నిర్వహించనున్న సభ పోస్టర్ల ఆవిష్కరణ

తాడ్వాయిలో డప్పు వాయిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

లింగంపేట/ బిచ్కుంద/ బాన్సువాడ టౌన్/ మాచారెడ్డి, ఫిబ్రవరి 2: 'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు అన్నారు. ఈ మేరకు ఆయా మండలాల్లో సభకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు.

తాడ్వాయి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండలంలోని ప్రతిగ్రామం నుంచి మాదిగలు జబ్బకు డప్పేసుకొని హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాగయ్య, జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు సంబంధించిన పోస్టర్లను జుక్కల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రుషేగామ భూమయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అంతకు ముందు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద డప్పు వాయించారు. మాదిగ ఉప కులాలకు అతీతంగా సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏండ్లుగా పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగకు మరింత బలాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మారుతి, సభ్యులు బాలాజీ, సూర్యకాంత్, పండరి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని మాదిగ దండోరా నాయకులు పిలుపునిచ్చారు. బాన్సువాడలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయకపోవడం దారుణమని వాపోయారు. వెంటనే ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలని లేనిపక్షంలో దండోరా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. లక్ష డప్పులు.. వేయి గొంతులు సభకు గ్రామాల వారీగా పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గురుగళ్ల బాలరాజు, మొక్క సాయిలు, గంగాధర్, గణేశ్, రాజు, సాయిలు, విఠల్, పోచీరాం, గంగారాం, డాకయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్యానాయక్ తండా, ఎక్స్ రోడ్ గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బట్ట వెంకట్రాములు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, వెంటనే ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో లక్ష డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం బాబు, సురేశ్, అరవింద్, దేవరాజు, రాజెల్లం, శ్రీనివాస్, నాగరాజు, రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో డప్పు కొడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బాన్సువాడలో..

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత

బాధితులకు ఫోన్లను అందజేస్తున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి, ఫిబ్రవరి 2: మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌కు చెందిన రమావత్ రాజు, లావుడ్యా ప్రకాశ్ ఇటీవల తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితులు వెంటనే మాచారెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్లు రికవరీ చేశారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు ఆదివారం అందజేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ట్రేస్ చేసి రికవరీ చేస్తామని చెప్పారు.

కురుమ యువ చైతన్య సమితి కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, ఫిబ్రవరి 2: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఆదివారం కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగల్ల రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ఒగ్గు నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెట్కూరి రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, కార్యదర్శిగా దాకాల మహిపాల్, కోశాధికారిగా మచ్చ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా దొడ్ల రమేశ్, సలహాదారులుగా చిందం మల్లేశ్, భాస్కర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్, ఉపాధ్యక్షుడు మహేశ్, జిల్లా లీగల్ అడ్వయిజర్ గంగరాజం తదితరులు పాల్గొన్నారు. సంఘ అభివృద్ధికి పాటుపడుతామన్నారు.

దేవునిపల్లి కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

మంజీర నుంచి ఇసుక తరలింపు

అడ్డుకున్న బరంగేడ్గి గ్రామస్తులు.. అధికారులకు ఫిర్యాదు

బీర్కూర్ మండలం బరంగేడ్గి శివారు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 2: బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామ శివారులోని మంజీరా నది పరీవాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం ట్రాక్టర్ల ద్వారా అనుమతి లేకుండానే ఇసుకను తరలిస్తున్నారు. కాగా స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇసుక తరలింపుపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారు నుంచి ఇసుకను మధ్యాహ్నం సమయంలో డంప్ చేసి రాత్రి పూట టిప్పర్ల ద్వారా ఇతర జిల్లాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పైప్‌లైన్ లీకేజీని అరికట్టండి సారూ..!

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని బోర్లం క్యాంపులో ప్రధాన పైప్ లైన్ లీకేజీ అవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ మురికి కాలువ గుండా ఉండడంతో నీరు లీకేజీ అవుతూ.. పైప్ ద్వారా మురికి నీరు వెళ్లి నీరు కలుషితమై రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతున్న విషయం సంబంధిత సిబ్బంది, అధికారులకు తెలిసినప్పటికీ పైప్‌లైన్‌కు మరమ్మతు చేయడం లేదని వారు వాపోతున్నారు. నెల రోజుల నుంచి పైప్‌లైన్ లీకేజీ అవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ పైప్ ద్వారానే వాటర్ ట్యాంకు నీరు సరఫరా అవుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

పైప్‌లైన్ నుంచి లీకవుతున్న నీరు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇందల్వాయి, ఫిబ్రవరి 2 : నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి గ్రామశివారులో ఉన్న 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన బత్తుల నాగరాజు (32) పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లి ఆదివారం ఉదయం మెదక్‌కు బైక్‌పై తిరిగి బయల్దేరాడు. మార్గమధ్యంలో చంద్రాయన్‌పల్లి శివారులో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ వాహనం ఢీకొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

నల్లమడుగు పెద్దతండాలో ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట్, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని నల్లమడుగు పెద్దతండాలో నూతనంగా నిర్మించిన జగదాంబా సేవాలాల్ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ నిర్మాణ సమయంలో సహాయ సహకారాలు అందించి, ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేను తండావాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, తండా పెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాల

●మూత్ర విసర్జనతో కంపుకొడుతున్న బిచ్కుంద ప్రభుత్వ పాఠశాల ఆవరణ ● పట్టించుకోని అధికారులు

పాఠశాలలో విరిగి ఉన్న తరగతి గదుల తలుపులు, కిటికీలు

పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనంలోని పై అంతస్తులో పడిఉన్న ఖాళీ మద్యం సీసాలు

బిచ్కుంద, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాఠశాల ప్రాంగణంలో మద్యం సీసాలు, తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. పాఠశాల ఆవరణలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. పాఠశాల ముందు గేటు కూలిపోవడంతో దాన్ని తిరిగి ఏర్పాటు చేయలేదు. దీంతో పాఠశాల పరిసరాల్లో ఉన్న దుకాణా సముదాయాలవారు మూత్ర విసర్జన చేయడంతో పాఠశాల ప్రాంగణం కంపుకొడుతున్నది. సెలవు దినాలతోపాటు రాత్రి వేళలో మందు బాబులు ఆట స్థలం, తరగతిగది వరండాలో మద్యం సేవిస్తున్నారు. తాగిన తర్వాత ఖాళీ సీసాలు, గ్లాసులు, తినుబండారాల వ్యర్థాలు, వాటర్ ప్లాంట్ వద్ద ఉన్న గోడపై మద్యం సీసాలు వదిలేసి వెళుతున్నారు. సెలవు దినాల్లో కొందరు ఆకతాయిలు తరగతి గదుల తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు రావడానికి జంకుతున్నారు. దేవాలయాల్లా భావించే విద్యాలయాల్లో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నా అడ్డుకునేవారు లేరని విద్యార్థులు, వారి తల్లిదండులు ఆందోళన చెందుతున్నారు. ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా అడ్డుకట్ట వేసేవారు లేకపోవడంతో విద్యార్థులు సైతం చెడు వ్యసనాలకు బానిసలు అవుతారేమోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పోలీస్ శాఖ స్పందించి పాఠశాల ప్రాంగణం, పరిసరప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా

నిర్మిస్తున్న భవనం సీజ్

బిచ్కుంద, ఫిబ్రవరి 2 : జుక్కల్ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని పంచాయతీ అధికారులు శనివారం సాయంత్రం సీజ్ చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి రాము మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన ప్రజాప్రతినిధి గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ భవన నిర్మాణం కోసం అనుమతి తీసుకొన్నారు. వాటితోపాటు అనుమతి తీసుకోకుండా సెల్లార్, మూడవ అంతస్తును నిర్మిస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భవన నిర్మాణ పనులు నిలిపివేసి సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఆయనవెంట గ్రామ కార్యదర్శి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఃజుక్కల్ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని పోలీసుల సహాయంతో సీజ్ చేస్తున్న పంచాయతీ అధికారులు

పార్టీని నమ్మిన వారికి ఉజ్వల భవిష్యత్తు

మాజీ కౌన్సిలర్లను సన్మానిస్తున్న నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 2: పార్టీని నమ్ముకొని ఉన్నవారికి మంచి గౌరవంతో పాటు పదవులు కూడా లభిస్తాయని, మంచి భవిష్యత్తు ఉంటుందని నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పీటీసీ ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ గ్రామంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఇంట్లో కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఐదేండ్లుగా మున్సిపల్ పరిధిలో వార్డు కౌన్సిలర్లుగా ఉత్తమ సేవలు అందించినందుకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముత్యాల సుజాత, కౌన్సిలర్లు భూంగారి రాము, ఎరుకల సాయిలు, జీనత్ సుల్తానా, స్థానిక నాయకులు శ్రావణ్‌కుమార్, ఇమ్రాన్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

శ్యామల (ఫైల్)

రామారెడ్డి, ఫిబ్రవరి 2 : మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో మహిళ అదృశ్యమైంది. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి శ్యామల నలభైరోజుల నుంచి కనిపించడం లేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. ఆమె కూతురు పూజిత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పనులు జరగవు.. కంపు తప్పదు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలో నూతన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అండర్‌గ్రౌండ్ డైనేజీ నిర్మాణం కోసం తవ్విన గుంతలు పనులు ముందుకు సాగక మురుగునీరు చేరి కంపుకొడుతున్నాయి. మండల కేంద్రం గోపాల్‌పేటలో రెండు నెలల క్రితం హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. యూనియన్ బ్యాంకు నుంచి బస్టాండ్ వరకు డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలు తవ్వి వదిలేశారు. ఇప్పటి వరకూ నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఇండ్లలోని మురుగునీరు వచ్చి గుంతల్లో చేరుతున్నది. దీంతో మురుగునీరు కంపుతో దారిగుండా వెళ్లేవారు, ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపుతో రోగాల బారిన పడుతున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్లు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ విషయమై అడిగితే..తమకు నిర్మాణాలపై ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. ఇకనైనా హైవే అథారిటీ అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలని, కంపు వాసన నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోపాలోపేటలో రహదారి నిర్మాణం కోసం తవ్విన గుంతల్లో నిలిచిన మురుగునీరు

శిథిలావస్థకు చేరిన

వాటర్‌ట్యాంకు మెట్లు

పట్టణంలోని 1వ వార్డులో శిథిలావస్థకు చేరిన ట్యాంకు మెట్లు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 2: శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకు మెట్లు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితికి చేరుకున్నాయని, అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రమాదం జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణానికి చెందిన 1వ వార్డు ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులోని వాటర్‌ట్యాంకు మెట్లు పూర్తిగా శిథిలమైపోయి పెచ్చులు ఊడి పడుతున్నాయని, ట్యాంకు వద్దకు వచ్చి తాగునీరు తీసుకెళ్లే వారిపై పడిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు కూలడానికి సిద్ధంగా ఉన్న మెట్లను తొలగించి, కొత్తమెట్లను ఏర్పాటు చేసి ప్రమాదాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

సరస్వతీమాత విగ్రహ ప్రతిష్ఠాపన

మహ్మద్‌నగర్ మండలం సింగీతం గ్రామంలో సరస్వతీమాత విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న పురోహితుడు

నిజాంసాగర్, ఫిబ్రవరి 2: మహ్మద్‌నగర్ మండలం సింగీతం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శ్రీ సరస్వతీ మాత విగ్రహావిష్కరణను మాజీ ఎంపీటీసీ శారద ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాసర పురోహితు మురళీధర్ శర్మ వేదమంత్రోచ్చరణలు, యజ్ఞం, పూజ కార్యక్రమాలతో శ్రీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేషాల నరేందర్‌రెడ్డి, రఘు, శంకర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఎడపల్లి, ఫిబ్రవరి 2: ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు తాలలేక పెట్రోల్ పోసుకొని నిప్పటించుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడ్డపల్లి గ్రామానికి చెందిన కోల దేవిసింగ్(30)కు భార్య, కుమారుడు ఉన్నారు. వారి ఆరోగ్యం, దేవీసింగ్ ఆరోగ్యం బాగాలేకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి పెట్రోల్ పోసుకొని నిప్పటించుకొని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.